ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



శ్రీకాకుళం
జిల్లా వార్తలు
ఆదివారం 3 ఆగస్టు 2025

ఆదిత్యాలయంలో విజిలెన్స్ విచారణ

అరసవల్లి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అరసవల్లిలోని ఆదిత్యాలయ కార్యాలయంలో శనివారం విజిలెన్స్ అధికారులు విచారణ నిర్వహించారు. 49 మంది దినసరి వేతనదారుల పేర్లు, వారు విధుల్లో చేరిన తేదీ, ఎంతవరకు జీతాలిచ్చారు.. తదితర వివరాలను సేకరించారు. గతంలో పనిచేసిన కంప్యూటర్ ఆపరేటర్ వివరాలను కూడా ఆరా తీశారు. అక్రమ వసూళ్లకు పాల్పడిన అభియోగంపై సస్పెండ్ అయిన సీనియర్ అసిస్టెంట్‌పై కూడా వివరాలు సేకరించారు. దినసరి ఉద్యోగులకు వేతనాలు ఎప్పటి నుంచి చెల్లించడం లేదో ఆరా తీశారు.

ఉద్దానానికి ఊపిరి!



పలాసలో కిడ్నీ పరిశోధన కేంద్రం-200 పడకల ఆసుపత్రి

పలాస కిడ్నీ పరిశోధన కేంద్రం-200 పడకల ఆసుపత్రిలో..

డయాలసిస్ చేసుకున్న వారు: **2024లో 6,454 మంది**
ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకూ: **3,929 మంది**
కిడ్నీ బాధితుల మరణాలు: **2024లో 40 మంది**
ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకూ: **ఆరుగురు**

- తగ్గుతున్న కిడ్నీ బాధితుల మరణాలు
- గడచిన ఆరు నెలల్లో ఆరుగురు మృతి
- గతంలో పదుల సంఖ్యలో మృత్యువాత
- చంద్రబాబు సీఎం అయ్యాక పటిష్ట చర్యలు
- ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న అధికారులు
- సురక్షిత తాగునీరు, ఆహారపు అలవాట్లు
- ఉచితంగా డయాలసిస్, మందులు, పింఛన్లు
- పరిశోధన కేంద్రం, ఆస్పత్రి గణాంకాలపై ఊరట



● ఈయన పేరు **రాపాక కోటేశ్వరరావు**. పలాస మండలం గొల్లమాకన్నపల్లి గ్రామానికి ఈయన టైలరింగ్ చేసుకొని జీవిస్తున్నారు. 18 ఏళ్ల కిందట కోటేశ్వరరావుకు కిడ్నీ వ్యాధి సోకింది. ఎందుకు వచ్చిందో తెలుసుకునేలోపే శరీరంలో అవయవాలు పనిచేయడం మానేశాయి. వారానికి మూడు రోజులు డయాలసిస్ చేయించుకుంటూ కాలాన్ని వెళ్లదీస్తున్నారు. తన గ్రామంలో ఇప్పటి వరకూ తన ఎదుటే 50కు పైగా కిడ్నీ వ్యాధితో మరణించారని ఆయన ఆవేదనతో తెలిపారు. సక్రమమైన ఆహార పద్ధతులు, నిత్యం మందులు వేసుకోవడం, డయాలసిస్ కారణంగా తాను ఇంకా భూమిపై ఉన్నానని చెబుతున్నారు.



● దీనంగా ఇంటి వద్ద కూర్చున్న ఈమె పేరు **లండ వరలక్ష్మి**. ఇటీవల ఉన్నట్లుండి వరలక్ష్మికి బీపీ పెరిగింది. నడుస్తుంటే ఆయాసం వస్తుంది. ఆసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోగా కిడ్నీ వ్యాధిగా తేలింది. 'మా ఇంటిలో ఎవరికీ ఇటువంటి వ్యాధి లేదు. డయాలసిస్ చేయించుకుంటున్న నాకు ప్రభుత్వం ఉచితంగా మందులు, ఖర్చులకు రూ.10వేలు పింఛను అందిస్తుంది. వ్యాధి తగ్గుముఖం పట్టడానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.' వరలక్ష్మి కోరుతోంది.

పలాస, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఉద్దానంలో కిడ్నీ వ్యాధి తగ్గుముఖం పడుతుందా?.. మారిన ప్రజల జీవనశైలి, ఆహార అలవాట్లే ఇందుకు కారణమా?.. అందుకే మరణాల సంఖ్య తగ్గుతుందా?.. అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఇందుకు పలాసలోని కిడ్నీ పరిశోధన కేంద్రం (200 పడకల ఆసుపత్రి) ప్రకటించిన గణాంకాలే నిదర్శనం. ఆసుపత్రి ప్రారంభించిన నుంచి ఇప్పటి వరకూ కిడ్నీ మరణాలను పరిశీలిస్తే.. గత ఏడాది 40 మరణాలు సంభవిస్తే తరువాత ఆరు నెలల కాలంలో కేవలం ఆరుగురు మాత్రమే మృతి చెందినట్లు రికార్డులు చెబుతున్నాయి. గ్రామాల్లో శుద్ధ జలాల పంపిణీ, కిడ్నీ బాధితులు తమ ఆహార అలవాట్లు మార్చుకోవడం, సకాలంలో స్పందించి డయాలసిస్ చేయించుకోవడం, తగిన మందులు వినియోగించడం, స్వీయనియంత్రణ ద్వారా కిడ్నీ మరణాలు తగ్గుముఖం పడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

గత టీడీపీ ప్రభుత్వ చర్యలతో సత్ఫలితాలు..

ఉద్దానంలో కిడ్నీ వ్యాధి నియంత్రణకు గత టీడీపీ ప్రభుత్వం చేపట్టిన చర్యలు ప్రస్తుతం సత్ఫలితాలు ఇస్తున్నాయి. వ్యాధి మూలకారకాలను తెలుసుకునేందుకు ప్రత్యేక బృందాలను నియమించడం, ఇంటింటా సర్వే నిర్వహించడం, వ్యాధి తీవ్రతను తగ్గించేందుకు డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేయడం, ప్రజలకు అవగాహన కల్పించడం వంటివి గత టీడీపీ ప్రభుత్వం చేసింది. అప్పటి సీఎం చంద్రబాబు తన సొంత నియోజకవర్గం కుప్పంలో పైలెట్ ప్రాజెక్టుగా ఏర్పాటు చేయాలని భావించిన ఎన్టీఆర్ సుజలధార పథకాన్ని ఉద్దానానికి తీసుకవచ్చారు. ఈ పథకంలో భాగంగా ఎక్కడికక్కడే మాస్టర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి 20 లీటర్ల శుద్ధ జలాన్ని కేవలం రూ.2కే ప్రజలకు అందించారు. అదే విధంగా జలజీవన్‌మిషన్ ద్వారా ఇంటింటికీ శుద్ధ జలాలను సరఫరా చేశారు. డయాలసిస్ రోగులకు ఉచితంగా మందులతో పాటు రూ.6 వేల పింఛన్ అందించింది. పింఛన్ డబ్బులతో డయాలసిస్ రోగులు బలవర్ధకమైన ఆహారం తీసుకునేవారు. ఇవాన్ని కూడా ప్రస్తుతం కిడ్నీ వ్యాధి, మరణాలు తగ్గడానికి కారణమయ్యాయి.

గొల్లమాకన్నపల్లిలోనే 50 మరణాలు..

పలాస మండలం గొల్లమాకన్నపల్లి గ్రామం నాలుగేళ్ల కిందట కిడ్నీ వ్యాధితో వణికిపోయింది. నాలుగేళ్లలో 50 మంది వరకూ మృతి చెందారు. ఎందుకు వ్యాధి వస్తుందో, ఎందుకు చనిపోతున్నారో తెలుసుకున్నంతలోపే పదుల సంఖ్యలో మరణాలు సంభవించేవి. గ్రామాన్ని వదిలి వేరే ప్రాంతానికి వెళ్లిపోదామా అనే పరిస్థితికి గ్రామస్థులు వచ్చేశారు. దాతలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం, రాజకీయ నాయకుల వైపు సహాయం కోసం వేచి చూడాలి వచ్చేది. అయితే, ప్రస్తుతం గొల్లమాకన్నపల్లిలో వ్యాధి తీవ్రత తగ్గింది. ఆరుగురు వరకూ డయాలసిస్ రోగులు ఉన్నారు. కొత్తగా వ్యాధి సోకిన దాఖలాలు కనిపించడం లేదు. ప్రస్తుతం ఉద్దానంలో అక్కడక్కడా మరణాలు జరుగుతున్నా 15 ఏళ్ల కిందట ఉన్న పరిస్థితి ప్రస్తుతం లేదు. గతంలో కిడ్నీ వ్యాధిపడిన వారే ప్రస్తుతం డయాలసిస్ చేయించుకుంటున్నారు.

వ్యాధి మూలాలపై అన్వేషణ..

ఉద్దానంలో కిడ్నీ వ్యాధి ప్రబలడానికి గల కారణాలపై నెఫ్రో వైద్యాధికారి డాక్టర్ రవిరాజ్‌తో (మిగతా 6వ పేజీలో..)



రైతులకు చెక్కును అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఎమ్మెల్యే ఎన్ఈఆర్

ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అభివృద్ధి

- రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండలపల్లి శ్రీనివాస్
- బొడ్డపాడులో 'అన్నదాత సుఖీభవ' చెక్కుల పంపిణీ

లావేరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం లావేరు మండలం బొడ్డపాడులో పౌరసరఫరాలశాఖ గోదాము వద్ద 'అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్' తొలివిడత పథకాన్ని ఆయన ప్రారంభించారు. పలువురు రైతులకు చెక్కులను అందజేశారు. అలాగే డ్రోన్ పరికరాన్ని ప్రారంభించారు. అనంతరం మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ.. 'గత వైసీపీ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని విస్మరించింది. రాష్ట్రాన్ని అప్పులమయం చేసింది. ఆర్థిక ఇబ్బందులున్నా.. ప్రజా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా భావిస్తూ.. కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోంది. అన్నదాత సుఖీభవ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏడాదికి ప్రతీ రైతుకు రూ.20వేలు చొప్పున విడతల వారీ అందజేయనుంది. ఈ పథకం ద్వారా జిల్లాలో 2.70 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరుతుంది. ఈ-పంట నమోదు చేసిన తర్వాత కౌలు రైతులకు కూడా ఈ పథకం వర్తింపజేస్తాం. డ్వాక్రా సంఘాల మహిళలకు అవసరం మేరకు రూ.90వేల కోట్లు రుణాలు అందజేయనున్నామ'ని తెలిపారు.

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. 'జిల్లాలో అర్హులైన ప్రతీ రైతుకి అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపజేస్తామన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా కింద రూ.160 చెల్లిస్తే.. పంట నష్టపోయిన రైతుకు పరిహారం అందుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే (మిగతా 6వ పేజీలో..)

మేడమ్.. ప్రక్షాళన చేస్తారా?

- పోలీసుశాఖలో సరిదిద్దాల్సిన సమస్యలెన్నో
- నేడు శ్రీకాకుళంలో హోంమంత్రి అనిత పర్యటన



హోంమంత్రి అనిత

శ్రీకాకుళం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రత పరిరక్షణలో కీలకంగా వ్యవహరించే పోలీసుశాఖలో పలు సమస్యలు ఉన్నాయి. కొంతమంది సిబ్బంది తీరుతో ప్రజలకు సక్రమంగా సేవలు అందడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఆదివారం హోంమంత్రి వంగలపూడి అనిత శ్రీకాకుళం నగరానికి రానున్నారు. ఈ నేపథ్యంలో ఇటు పోలీసుల ద్వారా ప్రజలకు అందే సేవల్లో పారదర్శకత.. అటు పోలీసుశాఖలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారంపై హోంమంత్రి దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

● ఏళ్ల తరబడి ఐటీ వింగ్‌లో పాత సిబ్బందే..

జిల్లా పోలీసుశాఖలోని ఐటీ వింగ్ విభాగంలో చాలామంది పాత సిబ్బందే ఉన్నారు. కొందరు బదిలీల్లో స్టేషన్లను మార్చుకుని.. డిప్యూటేషన్ చూపిస్తూ ఏళ్లతరబడి అదే సీట్లలో అతుక్కుపోయారనే విమర్శలు ఉన్నాయి. పాతవారిని తప్పించి, కొత్తవారికి ఐటీ రంగంపై శిక్షణ ఇస్తే మరికొంత పారదర్శకంగా సేవలు లభించే అవకాశముంది.

● కనిపించని ఫ్రెండ్లీ పోలీసింగ్..

జిల్లాలో ఎక్కడా ఫ్రెండ్లీ పోలీసింగ్ కనిపించడంలేదు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా నడుచుకోకుండా కొంతమంది సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారు. దీంతో చాలామంది పోలీసుస్టేషన్ కంటే.. జిల్లా పోలీసు కార్యాయానికే వచ్చి న్యాయం కోసం అర్జీలు ఇస్తున్నారు. అలాగే పరిధితో సంబంధం లేకుండా బాధితులు తక్షణ సహాయం కోసం సమీప పోలీసుస్టేషన్‌కు వెళ్తే 'జీరో' ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ ఈ విషయాన్ని పోలీసుస్టేషన్లలో పట్టించుకోవడంలేదు. ఇది ఫలానా పరిధిలో ఉంది... ఫలానా స్టేషన్‌కు వెళ్లాలి అంటూ బాధితున్ని పంపేస్తున్నారు. అలాగే పాస్‌పోర్టు దరఖాస్తుదారుల పరిశీలనకు.. ధ్రువపత్రాల పరిశీలనకు సంబంధించి.. క్యారెక్టర్ సర్టిఫికెట్ విషయాల్లో సంబంధిత సిబ్బంది రూ.వేలల్లో మామూళ్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు (మిగతా 6వ పేజీలో..)



నగరంలో నటి నిధి అగర్వాల్ సందడి

7 లో

ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

- కార్పొరేట్లకే రూ.కోట్లలో రుణమాఫీ
- వైసీపీ పాలనలో కల్తీ మద్యంపై సిట్ నివేదిక కావాలి
- కేంద్ర మాజీమంత్రి చింతా మోహన్



మాట్లాడుతున్న కేంద్ర మాజీమంత్రి చింతా మోహన్

అరసవల్లి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): 'పార్లమెంట్‌లోకి మీడియాను అనుమతించకపోవడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు. బీజేపీ నాయకులారా ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' అని కేంద్ర మాజీమంత్రి చింతా మోహన్ అన్నారు. శ్రీకాకుళంలోని ప్రైవేటు హోటల్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. 'కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం గత 11ఏళ్లలో రూ.14.5లక్షల కోట్లు రుణమాఫీ చేసింది. అది కేవలం కార్పొరేట్ల కోసమే. వారేమీ పేదలు కాదు. అందులోనూ గుజరాత్‌కు చెందిన వారికే ఎక్కువ రుణమాఫీ చేశారు. ఏయే రాష్ట్రానికి ఎంతెంత రుణమాఫీ చేశారో సీతారామన్ ప్రకటించాలి. ఇందులో 10శాతం కమీషన్ చేతులు మారిందనే విమర్శలు కూడా ఉన్నాయ'ని చింతా మోహన్ ఆరోపించారు. 'వైసీపీ ఐదేళ్ల పాలనలో కల్తీ మద్యం తాగి వేలాదిమంది ప్రాణాలు కోల్పోయారు. మద్యం స్కామ్‌కు సంబంధించి సిట్ విచారణ నివేదికను బహిర్గతం చేయాల'ని చింతా మోహన్ డిమాండ్ చేశారు. అలాగే ఓబీసీలకు రిజర్వేషన్లు ఉండాల్సిందేనని పేర్కొన్నారు.



స్టేషన్లకు వచ్చే మహిళలతో మర్యాదగా వ్యవహరించాలి

- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

6 లో



మహిళలను కించపరిచిన వారిని పరామర్శిస్తారా?

- జగన్ తీరుపై ఎమ్మెల్సీ గ్రీష్మ ఆగ్రహం

7 లో

ఎందుకురా ఇలా చేశావు?

- చదువు ఇష్టం లేకపోతే.. చనిపోవాలా?
- రైలు కిందపడి పాలిటెక్నిక్ విద్యార్థి ఆత్మహత్య



హేమంత్ మృతదేహం



హేమంత్ (ఫైల్)

ఆమదాలవలస, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఆ విద్యార్థి పాలిటెక్నిక్ డిప్లమో చదువుతున్నాడు. ఆ చదువు పూర్తయితే.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చు. కానీ చదువు అంటేనే ఇష్టం లేదని ఆ విద్యార్థి తల్లిదండ్రులకు చెప్పాడు. చదువుకుంటేనే భవిష్యత్ ఉంటుందని వారు నచ్చజెప్పారు. దీంతో మనస్తాపం చెంది రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులకు తీరని విషాదాన్ని మిగిల్చాడు. ఈ ఘటనకు సంబంధించి శ్రీకాకుళం రోడ్డు(ఆమదాలవలస) రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా సంతకవిటి మండలం మందరాడ గ్రామానికి చెందిన దేవల హేమంత్(16) అనే విద్యార్థి చదువు ఇష్టం లేక రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆమదాలవలస రైల్వేస్టేషన్‌లో శనివారం తెల్లవారుజామున 3.30గంటల సమయంలో విజయనగరం నుంచి భువనేశ్వర్ వెళ్తున్న హీరాఖండ్ రైలు కింద పడి ప్రాణాలు కోల్పోయాడు. హేమంత్‌ను తన తండ్రి మణిభూషణరావు.. దన్నానపేట వద్ద ఉన్న ఆమదాలవలస ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గత నెలలో డిప్లమో మొదటి సంవత్సరంలో చేర్పించారు. హేమంత్.. పాలిటెక్నిక్ కళాశాలలో చదువుకుంటూ, పట్టణంలోని బీసీ వసతిగృహంలో గత కొద్దిరోజుల నుంచి ఉంటున్నాడు. చదువుపై ఆసక్తి లేక, ఆమదాలవలసలో ఉండడం ఇష్టం లేక మూడు రోజుల కిందట స్వగ్రామమైన మందరాడకు వెళ్లిపోయాడు. తనకు చదువుపై ఆసక్తి లేదని తల్లిదండ్రులకు చెప్పాడు. కాగా.. చదువుకుంటేనే భవిష్యత్ బాగుంటుందని వారు నచ్చజెప్పి.. ఆమదాలవలసలో హాస్టల్‌కు శుక్రవారం తీసుకువచ్చారు. దీంతో హేమంత్ మనస్తాపం చెంది.. శనివారం తెల్లవారుజామున రైలు కింద పడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్ర గాయాలపాలైన హేమంత్‌ను రైల్వేపోలీసులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని, ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని రైల్వే పోలీసులు తెలిపారు.

ఆక్రమణల జోరు

- నక్కపేటలో చెరువులు, గట్లు కబ్జా
- శ్మశానవాటికనూ వదలని వైనం
- ఫిర్యాదు చేసినా అక్రమార్కులపై కానరాని చర్యలు



మర్రిబంద చెరువు గట్టుపై పశువుల పాకలు

జి.సిగడాం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జి.సిగడాం మండలం సీతంపేట పంచాయతీ నక్కపేటలో ఆక్రమణలు జోరుగా సాగుతున్నాయి. చెరువులు, చెరువుగట్లు, శ్మశానవాటికను కూడా ఆక్రమణదారులు వదలడం లేదు. గట్టు పొడవునా పశువుల పాకలు వేసేశారు. శ్మశానవాటికలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. చెరువు గర్భాన్ని పంట పొలాలుగా మార్చేస్తున్నారు. దీంతో చెరువులు రూపం కోల్పోతున్నాయి. శ్మశానవాటికల ఉనికి ప్రశ్నార్థకం అవుతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమార్కులపై అధికారులు కనీసస్థాయిలో దృష్టి సారించడం లేదని ఆరోపిస్తున్నారు.

● నక్కపేట గ్రామానికి ఆనుకుని ఉన్న మర్రిబంద సర్వేనెంబరు 236లో చెరువు గర్భం 4.72 సెంట్లు ఉంది. మర్రిబంద కింద ఆయకట్టు 10.97 సెంట్లు. దీనిలో కొంతమంది అక్రమంగా మట్టితో పూడ్చి ఆక్రమించి పశువుల శాలలు నిర్మించారు. చెరువు మదుములు, సప్పాలు మూసివేయటంతో దిగువ ఉన్న ఆయకట్టుకు సాగునీరు అందక రైతులు అవస్థలు పడుతున్నారు.

● గ్రామ శివారులోని శ్మశానవాటిక ఆక్రమణకు గురైంది. సర్వేనెంబరు 233/9లో ఐదు ఎకరాల విస్తీర్ణం అన్యాక్రాంతమైంది. శ్మశానవాటికను ఆక్రమించి షెడ్లు వేయడంతో.. మృతదేహాల దహన సంస్కరణకు ఇబ్బందులు తప్పడం లేదు.

● నక్కపేటలోని సర్వేనెంబరు 226లో గుంటుకువాని చెరువు విస్తీర్ణం 31.90 సెంట్లు. దీని కింద ఆయకట్టు 61.34 సెంట్లు. కాగా చెరువు గర్భంలో మట్టిని వేసి సుమారు 10 (మిగతా 6వ పేజీలో..)



నక్కపేటలో ఆక్రమణకు గురైన శ్మశానవాటిక



నేస్తమే.. సమస్తం

- సృష్టిలో తీయనిది స్నేహం
- నేడు స్నేహితుల దినోత్సవం

6 లో

డీఎంహెచ్‌వో కార్యాలయ సూపరింటెండెంట్ సస్పెన్షన్

- ఏఎన్ఎం బదిలీల్లో అవకతవకలపై చర్యలు

6 లో

నేస్తమే సమస్తం

- సృష్టిలో తీయనిది స్నేహం
- మైత్రీ బంధానికి నిదర్శనంగా నిలుస్తున్నది ఎందరో
- నేడు స్నేహ దినోత్సవం



స్నేహమంటే ఇద్దరు మనుషులు..
రెండు మనసుల అనుబంధానికి చిహ్నం.
కులమతాలకు... ప్రాంతాలకు అతీతమైనది స్నేహబంధం. బంధుత్వాల కంటే పదునైనది మైత్రీ బంధం. చిన్నప్పటి నుంచి ఒకేమాట..ఒకే బాటగా నిలుస్తున్న వారు ఎందరో ఉన్నారు. అదీ స్నేహం గొప్పతనం. ఇక బృందాలుగా ఉంటూ... తమ మిత్రులతో పాటు తోటివారికి సాయ పడుతున్న నేస్తాలూ ఉన్నారు. వీరంతా మిగిలిన వారికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఇద్దరూ ఒక్కటిగానే..

శ్రీకాకుళం కల్చరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): లావేరు మండలం మురపాకకు చెందిన మలిపెద్ది చంద్రశేఖరరావు, మురపాక శ్రీనివాసరావు చిన్ననాటి నుంచి స్నేహితులు. ఏ పని చేయాలన్నా... ఇద్దరూ కలసి నిర్ణయం తీసుకోవలసిందే. టెన్త్, ఇంటర్ మాత్రమే కాదు... లైబ్రేరియన్లుగా శిక్షణ కూడా కలిసే పూర్తి చేశారు. ఆ తరువాత 1987లో గ్రంథాలయ అధికారులుగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఉత్తమ గ్రంథాలయ అధికారులుగా మంచిపేరు తెచ్చుకున్నారు. వీరిద్దరూ ఏటా జంటగా తిరుపతి మెట్ల మార్గంలో కాలి నడకన తిరుమల వెళ్లి వేంకటేశ్వరుని దర్శించుకుంటుంటారు. ఎక్కడికైనా ఇద్దరూ కలిసే వెళుతుంటారు. వీరి భార్యలు కూడా ప్రాథమిక స్థాయి నుంచి స్నేహితులే. గ్రంథాలయాలలో వేసవి శిక్షణ శిబిరాలు, గ్రంథాలయ వారోత్సవాలు ఇలా ఏ కార్యక్రమం చేపట్టాలన్నా... ప్రణాళిక ప్రకారం ఇద్దరం కలిసే చేస్తామని చెబుతున్నారు. అలా ఉత్తమ సేవకులుగా గుర్తింపు పొందారు.


చంద్రశేఖర్, శ్రీనివాసరావు

ఆ 13 మంది..

- ఆ మిత్రబృందానిది ప్రత్యేక స్థానం

ఇచ్ఛాపురం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాజకీయ నాయకుడు... పోలీసు ఉద్యోగి... వ్యాపారి.. ఉపాధ్యాయుడు.. ఆర్మీ మేజర్.. వీరంతా ఎవరా అనుకుంటున్నారా? ఓ స్నేహబృందంలోని సభ్యులు. ఎంత దూరంలో ఉన్నా.. ఒకరి కష్టసుఖాల్లో ఒకరు పాలుపంచుకుంటారు. ఇచ్ఛాపురం పట్టణంలో ఈ మిత్ర బృందానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. వీరంతా ప్రాథమిక స్థాయి నుంచే స్నేహితులు. ఇప్పటికీ వీరి స్నేహం అలానే కొనసాగుతోంది. వీరిలో జనసేన ఇచ్ఛాపురం ఇన్‌చార్జి దాసరి రాజు ఒకరు. ఇచ్ఛాపురంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పి.మురళీధర్, ఆర్మీ రిటైర్డ్ మేజర్ దక్కత సుమన్ రెడ్డి, పాత్రికేయుడు పల్లంటి చిరంజీవి, టెక్కలిలో ఎక్సైజ్ శాఖ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న గొనప శ్రీనివాసరావు, విజయవాడలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రామరాజు, ఇచ్ఛాపురంలో వ్యాపారవేత్త కొరికాన యోగేశ్వరరావు, కాకినాడలో శ్రీకృష్ణుని ఆలయంలో ప్రధాన అర్చకులుగా ఉన్న జనార్దనాచార్యులు, విశాఖలో ఫైర్‌స్టేషన్ హోంగార్డుగా పనిచేస్తున్న బాలాజీ, వైజాగ్‌లో ఎలక్ట్రానిక్స్ గూడ్స్ మార్కెటింగ్‌లో పనిచేస్తున్న టి.శివ, విశాఖలో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో స్థిరపడిన సనపల రమణ, ముంబైలో కన్‌స్ట్రక్షన్ కంపెనీలో పనిచేస్తున్న వెంకటరమణ, ఒడిశాలోని ఓ టీవీ చానల్‌లో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న శ్యాం, హైదరాబాద్‌లో స్థిరపడిన రిటైర్డ్ ఆర్మీ అధికారి రత్నాల జ్యోతి కుమార్ చౌదరి.. ఇలా వీరంతా మిత్ర బృందం. ఏడాదిలో రెండుసార్లు కలుస్తుంటారు. అందరికీ ఖాళీగా ఉన్న సమయంలో కలుసుకొని చాలా ఆనందంగా గడుపుతుంటారు. పూర్వ విద్యార్థుల్లో అనారోగ్యానికి గురైన వారికి చేతనైన సాయం చేస్తుంటారు. ఒకరి కష్టసుఖాలను మరొకరు పంచుకుంటారు. వీరందరి వయసు ఐదు పదులు దాటింది. స్థాయిలతో పని లేకుండా వీరంతా ఒక్కటిగా ముందుకెళుతుండడం గమనార్హం.


రాజుతో చిన్ననాటి మిత్రులు

స్నేహమే.. తమ మతమని..

రణస్థలం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్నేహానికి కులమతాలు అడ్డురావని పుస్తకాలలో చదువుతుంటాం. కానీ నిజ జీవితంలో చాలా తక్కువ మంది మాత్రమే దీనిని పాటిస్తుంటారు. అలాంటి అతి కొద్ది మంది కోవకే చెందుతారు ఆ ముగ్గురు. ఒకరు హిందూ, మరొకరు ముస్లిం, ఇంకొకరు క్రైస్తవుడు.. కానీ ఈ మూడు మతాల వారినీ స్నేహమనే బంధం నడుపుతోంది. మండల కేంద్రానికి చెందిన కలిశెట్టి అప్పలనాయుడు, షేక్ సుబాన్, టి.శ్యాం ప్రసాద్‌లు 30 సంవత్సరాలుగా స్నేహితులు. పట్టు పరిశ్రమల శాఖలో పనిచేసే సుబాన్ 30 ఏళ్ల కిందట రణస్థలం వచ్చి స్థిరపడ్డారు. పశ్చిమ గోదావరి జిల్లా నుంచి కెప్టెన్ రావు మాస్టారు ఉపాధ్యాయుడిగా వచ్చి రణస్థలంలో స్థిరనివాసం ఏర్పరచు కున్నారు. ఆయన కుమారుడే శ్యాంప్రసాద్. ఆయన ప్రస్తుతం విశాఖలో ఏఎస్ఐగా పనిచేస్తున్నారు. ఇక కలిశెట్టి అప్పలనాయుడుది రణస్థలం పక్కనే వీఎన్‌పురం. ప్రస్తుతం విజయనగరం ఎంపీగా ఉన్నారు. ఇంటర్ చదివిన నాటి నుంచి ఈ ముగ్గురూ మంచి స్నేహితులు. ఇప్పటికీ అదే స్నేహాన్ని కొనసాగిస్తున్నారు. ఇటీవల అప్పలనాయుడు ఎంపీగా ఎన్నిక కావడంతో వారిద్దరి ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. వీరిలో సుబాన్ ముస్లిం కాగా.. శ్యాంప్రసాద్ క్రిస్టియన్.. అప్పలనాయుడు హిందూ. ఈ ముగ్గురి మధ్య మతాల ప్రసక్తే లేదంటారు. మూడు మతాలకు చెందిన పర్వదినాల్లో కలిసే పాల్గొంటారు. వారి పిల్లల్లోనూ అదే భావన పెంపొందిస్తున్నారు. మత సామరస్యం పెంపొందించడానికి తమవంతుగా కృషి చేస్తున్నారు.


ఎంపీ కలిశెట్టితో మిత్రులు

ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందిస్తూ...

శ్రీకాకుళం కల్చరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఇటు సేవల్లో.. అటు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాలు పంచుకుటూ.. 40 ఏళ్ల స్నేహాన్ని పవిత్రంగా కాపాడుకుంటూ ముందుకు వెళుతున్నారు నగరానికి చెందిన విశ్రాంత డిప్యూటీ ఇంజనీర్లు కుప్పిలి నరసింహమూర్తి, ముద్దాడ అప్పలనాయుడు. శ్రీకాకుళంలో పాలిటెక్నిక్ చదివేటప్పుడు ఆమదావలసకు చెందిన ముద్దాడ అప్పలనాయుడుతో నరసింహమూర్తికి మొదలైన పరిచయం... స్నేహంగా మారింది. ఇప్పటికీ పదిలంగా ఉంది. ఇద్దరూ 1979లో అసిస్టెంట్ ఇంజనీర్లుగా వృత్తిని ప్రారంభించారు. డిప్యూటీ ఇంజనీర్లుగా పదవీ విరమణ చేశారు. తొలి నుంచీ ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాల్లో ఇద్దరూ చురుకుగా పాల్గొంటూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇద్దరూ కలిపి 30 సంవత్సరాలుగా అయ్యప్పమాల ధారణ చేస్తూ శబరిమలకు కలిసే వెళుతున్నారు. అరసవల్లిలో ప్రత్యేకంగా అయ్యప్పస్వామి సన్నిధానం ఏర్పాటు చేసి.. అనేక మందితో అయ్యప్ప మాలలు వేయించి గురుస్వాములుగా ఉన్నారు. నగరంలోని కృష్ణా పార్క్ వద్ద, అరసవల్లిలో షిరిడి సాయిబాబా మందిరాన్ని నిర్మించి.. ప్రత్యేక పూజలు చేస్తున్నారు.


పల్లకీని మోస్తున్న స్నేహితులు


శ్రీనివాసుని అలంకరించిన దృశ్యం

శ్రీనివాసునికి పూలతో అలంకరణ

నరసన్నపేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా శ్రీదేవి, భూదేవి సహిత గోవిందునికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి ప్రత్యేకంగా అలంకరించి... పసుపు, కుంకుమార్చనలు చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అభివృద్ధి

(ఐదో పేజీ తరువాయి)

నడుకుదిటి ఈశ్వరరావు మాట్లాడుతూ.. 'ఎచ్చెర్ల నియోజకవర్గం.. పూర్తిగా వ్యవసాయాధారితం. ఈ ప్రాంతంలో ప్రజలకు ఉపాధి కల్పించేందుకు ఫుడ్ ప్రోసెసింగ్ పరిశ్రమలు స్థాపించాలని ఇప్పటికే సీఎం చంద్రబాబు నాయు దృష్టికి తీసుకెళ్లాను. అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం కింద నియోజకవర్గంలో 48,103 రైతులకు రూ.3,189.89 లక్షల వరకు లబ్ధి చేకూరింద'ని తెలిపారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్డీవో ప్రత్యూష, వ్యవసాయశాఖ జేడీ త్రినాథస్వామి, ఏడీఏ శ్రీనివాస్, టీడీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి ముప్పిడి సుజాత, మండల టీడీపీ అధ్యక్షుడు ముప్పిడి సురేష్, బీజేపీ మండల అధ్యక్షుడు ఎల్.అప్పలనాయుడు, ఎంపీడీవో పి.వెంకటరాజు, తహసీల్దార్ జి.శ్రీనివాసరావు, ఏవో మహేష్ నాయుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ తోటయ్యదొర, కూటమి నాయకులు లంక నారాయణరావు, ముప్పిడి మురళీమోహన్, గొర్లె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆక్రమణల జోరు

(ఐదో పేజీ తరువాయి)

ఎకరాల విస్తీర్ణాన్ని పంట పొలాలుగా మార్చుకున్నారు. దీంతో చెరువు రూపం కోల్పోయింది.

- ఆక్రమణలు తొలగించాలని, చెరువులకు రక్షణ కల్పించాలని రెండు నెలల కిందట రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశామని గ్రామానికి చెందిన పొగిరి వెంకటరమణ, స్థానికులు తెలిపారు. వీఆర్వోతో విచారణ చేయించి కొంతమంది ఆక్రమణదారులకు మాత్రమే నోటీసులు ఇచ్చారని, మిగతా వారి విషయంలో జాప్యం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువులు, శ్మశానవాటిక ఆక్రమణకు గురికాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.
- ఈ విషయమై జి.సిగడాం తహసీల్దార్ ఎం.సరిత వద్ద ప్రస్తావించగా.. 'నక్కపేట గ్రామస్థుల ఫిర్యాదు మేరకు ఇటీవల జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ సమక్షంలో గ్రామంలోని చెరువు, చెరువు గట్టు, శ్మశానవాటిక ఆక్రమణలు పరిశీలించాం. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపించామ'ని తెలిపారు.

ఉద్దానానికి ఊపిరి!

(ఐదో పేజీ తరువాయి)

కూడిన బృందం గతంలో అన్వేషణ చేపట్టింది. పలాస, మందస, వజ్రపుకొత్తూరు, కవిటి, సోంపేట, కంచిలి, ఇచ్ఛాపురం మండలాల్లో పర్యటించింది. వ్యాధి మూలకాలను గుర్తించినా అవి ప్రయోగాత్మకంగా నిరూపితం కావాల్సి ఉంది. అదే విధంగా ఆంధ్రాయూనివర్సిటీకి చెందిన అనేక మంది పరిశోధకులు కూడా ఉద్దానం కిడ్నీ వ్యాధులపై అధ్యయనం చేశారు. దశాబ్దాల కాలంలో ఈ ప్రాంతంలో విస్తారంగా పండే జీడి పంటలకు వేసే క్రిమిసంహారక మందులు భూమిలో కలసిపోయి వ్యాధి తీవ్రతకు ఒక కారణమని విశ్లేషించారు.

- రాష్ట్ర ప్రభుత్వం పలాసలోని కిడ్నీ పరిశోధన కేంద్రంలో ఉన్న గ్లోబల్ ఇనిస్టిట్యూట్‌కు పరిశోధన బాధ్యతలు అప్పగించింది. విదేశాలకు చెందిన నెఫ్రాలజిస్టులు, శాస్త్రవేత్తల బృందం ఇప్పటికే అనేక దశల్లో పరిశోధన చేసింది. వీటి ఫలితాలు వెలువడేసరికి మరో ఏడాది సమయం పట్టవచ్చు. ప్రస్తుతం వ్యాధి మూలకారకాలతో సంబంధం లేకుండా అనేక గ్రామాల్లో వ్యాధి తగ్గుముఖం పడుతున్న వేళ ప్రజలు మరింత అప్రమత్తం కావాల్సి ఉందని నిపుణులైన వైద్యాధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా తాగునీరు, ఆహార అలవాట్లు మార్చుకోవడం, వేగంగా అరుగుదల ఉండే ఆహారం తీసుకోవడం, జంక్ ఫుడ్‌కు పూర్తిగా దూరంగా ఉండడం, నిత్యం వ్యాయామం చేయడం, ఏ చిన్న అనారోగ్యం వచ్చినా నిపుణుల సూచనలు పాటిస్తూ తగిన మందులు వినియోగించడం చేస్తే వ్యాధిని అరికట్టడానికి అవకాశం ఉంటుందనే అభిప్రాయాన్ని వైద్యాధికారులు వ్యక్తం చేస్తున్నారు. ఒక ఇంటిలో కిడ్నీ వ్యాధి సోకితే భయపడకుండా మొత్తం ఆ ఇంటిల్లపాది పరీక్షలు చేసుకోవడమే ఉత్తమమని అంటున్నారు. వ్యాధికి గల కారకాలు తెలిసి, అది అదుపులోకి వస్తే ఉద్దానం మరో ఉద్యానవనం కావడం ఖాయం.

నిర్లక్ష్యం వద్దు..



గడచిన ఆరు నెలల్లో ఉద్దానంలో కిడ్నీ మరణాలు తగ్గాయి. మా ఆసుపత్రిలో గత ఏడాది 40 మంది వరకూ మరణించారు. గత ఆరు నెలల్లో కేవలం ఆరుగురు మాత్రమే మృత్యువాత పడ్డారు. డయాలసిస్ దశ వచ్చిన వరకూ ఆసుపత్రికి రాకపోవడం వల్లే కిడ్నీ మరణాలు జరుగుతున్నాయి. ప్రారంభ దశలోనే తగిన మందులు వేసుకొని, ఆహార అలవాట్లు మార్చుకుంటే కిడ్నీ వ్యాధి తీవ్రత ఉండదు. మూడు, నాలుగేళ్లలో వ్యాధి పూర్తిగా తగ్గించవచ్చు. ఒక ఇంటిలో ఎవరికైనా వ్యాధి సోకితే మిగతా వారు కూడా పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం. మా ఆసుపత్రిలో కిడ్నీ వ్యాధిని నయం చేయడానికి తగిన పరికరాలు, మందులు ఉన్నాయి. మొత్తమంతా ఉచితంగానే అందిస్తాం.

-డాక్టర్ అల్లు పద్మజ, సూపరింటెండెంట్, కిడ్నీ పరిశోధన కేంద్రం, పలాస

వ్యాధి తీవ్రత తగ్గింది..



కిడ్నీ వ్యాధిపై ఇప్పటికీ ప్రజల్లో భయాందోళనలు ఉన్నాయి. మరణాలు తగ్గినా ప్రభుత్వం ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తూనే ఉండాలి. వ్యాధి మూలాలు కనుగొని వాటిపై దృష్టిపెట్టి నివారణ చర్యలు తీసుకుని ఉండుంటే ఇంతగా ప్రబలేది కాదు. ప్రభుత్వం పూర్తిగా చొరవ తీసుకొని సురక్షితమైన తాగునీరు అందించడంతో పాటు బాధితులు డయాలసిస్‌కు వెళ్లడానికి వాహనాలు సమకూర్చాలి.

-తెప్పల అజయ్‌కుమార్, జీడి రైతాంగ సాధనకమిటీ చైర్మన్, మాకన్నపల్లి

స్వీయ నియంత్రణ అవసరం..



స్వీయ నియంత్రణతోనే కిడ్నీ వ్యాధి అదుపులోకి వస్తుంది. పరిశుభ్రమైన నీరు తాగకపోవడం, మంచి ఆహార అలవాట్లు పాటించకపోవడం, విపరీతంగా ఔషధాల వినియోగం వంటి కారణాలతో గతంలో కిడ్నీ భూతం పట్టింది. ప్రభుత్వం సర్వేచేసి కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు, అవసరం ఉన్నవారికి డయాలసిస్ చేయించాలి. వారికి ఆసుపత్రికి వెళ్లడానికి వీలుగా వాహన సౌకర్యం కల్పించాలి. ప్రజలకు వ్యాధి కారకాలపై అవగాహన కల్పించాలి. పరిశోధన ఫలితాలు వచ్చిన వెంటనే ప్రజలకు తెలియజేయాలి.

-లింగమూర్తి, రిటైర్డ్ ఆర్మీ, గొల్లమాకన్నపల్లి

మేడమ్.. ప్రక్షాళన చేస్తారా?

(ఐదో పేజీ తరువాయి)

ఉన్నాయి. ఇక సివిల్ వ్యవహారాల్లో కొంతమంది పోలీసులు శ్రద్ధ చూపుతున్నారు.

● ప్రారంభించని 'మోడల్ పోలీసు స్టేషన్'..

మందస మండలంలో కోట్లాది రూపాయలతో మోడల్ పోలీసు స్టేషన్‌ను మూడేళ్ల క్రితం నిర్మించారు. కానీ ఇంతవరకు ప్రారంభించ లేదు. ఎల్.ఎన్.పేట మండలంలో ఇంతవరకు పోలీసు స్టేషన్ నిర్మించలేదు. పక్క మండల సరిహద్దు పోలీసుస్టేషన్ సిబ్బందే ఆ మండలంలో లా అండ్ ఆర్డర్‌ను చూస్తున్నారు. ఇప్పటికైనా ఎల్.ఎన్.పేటలో పోలీసు స్టేషన్‌ను నిర్మించాలి.

● పోలీసుల సమస్యలివీ..

గత ప్రభుత్వ హయాంలో పోలీసులకు వీక్లీ ఆఫ్ అని ఏడాదిన్నర పాటు అమలుచేసి చేతులెత్తేసింది. వీక్లీఆఫ్‌ను అమలు చేస్తే ఒత్తిడి నుంచి కాస్త ఉపశమనం లభిస్తుందని పలువురు పోలీసులు భావిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్ ఉంచేసిన సరెండర్ లీవ్స్, అడిషనల్ సరెండర్ లీవ్‌లు.. వీటికి రావాల్సిన డబ్బులు కూడా ప్రభుత్వం విడుదల చేయాలని కోరుతున్నారు. ఇటీవల పోలీసులకు జరిగిన వైద్యపరీక్షల్లో ఐదు నుంచి పదిశాతం మందికి గుండె జబ్బులు వచ్చే అవకాశమున్నట్లు తేలింది. అలాగే 35 శాతం మందికి రక్తపోటు, చక్కెర ఉన్నట్లు గుర్తించారు. ఇటువంటి వారికి బందోబస్తు విధులలో.. కేవలం అంతర్గత జిల్లాలోనే కేటాయిస్తే వెసులుబాటు ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వీటన్నింటిపై హోంమంత్రి.. ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని భావిస్తున్నారు.

తాత్కాలిక కోర్టుకు భవనం పరిశీలన

పాతపట్నం ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ఎస్సీఎస్టీ సెల్ జిల్లా న్యాయాధికారి ఫణికుమార్ శనివారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం కోర్టుకు నూతన భవన నిర్మాణం జరగనున్న నేపథ్యంలో తాత్కాలికంగా నిర్వహణకుగాను స్థానిక వైటీసీ భవనాన్ని పరిశీలించారు. ఆయన వెంట జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.రోషిణి, న్యాయవాదులు ఉన్నారు.


వైటీసీ వద్ద అధికారులతో న్యాయాధికారి ఫణికుమార్

ముమ్మరంగా ఉభాలు

ఎల్ఎన్‌పేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వంశధార నది కుడి ప్రధాన కాలువ దిగువన ఉన్న వివిధ గ్రామాల్లో రైతులు ముమ్మరంగా ఉభాలు చేస్తున్నారు. వర్షాలు ఆశించిన స్థాయిలో లేనప్పటికీ... కాలువ దిగువన ఉన్నందున ముమ్మరంగా ఉభాలు చేస్తున్నారు. కోవిలాం, పెద్దకోట, మిరియాపల్లి, రావిచెంద్రి, చిట్టిమండలం, వాడవలస, దబ్బపాడు, తురకపేట తదితర గ్రామాలకు చెందిన రైతులు పొలం పనుల్లో నిమగ్నం అవుతున్నారు.


కోవిలాం సమీపంలో పొలం పనుల్లో మహిళలు

అమ్మను మరిపించే అక్కాచెల్లెళ్లు

- నేడు సిస్టర్స్ డే

మన జీవితంలో అమ్మానాన్నల తరువాత అత్యంత ముఖ్యమైన వారు తోబుట్టువులు. ఆటపాటల్లోనే కాదు.. కష్టసుఖాల్లోనూ తోడుగా నిలిచేది తోబుట్టువులే. ఇక అక్కచెల్లెళ్ల బంధం కోసం ఎంత చెప్పినా తక్కువే. అన్నదమ్ములు విడిపోయిన సందర్భాల కంటే.. అక్కచెల్లెళ్లు విడిపోయే సందర్భాలు చాలా తక్కువ. తమ తోబుట్టువులకు అమ్మ పాత్ర పోషించిన అక్కాచెల్లెళ్లు ఎందరో ఉన్నారు. అమ్మానాన్నలతో పంచుకోలేని అనేక విషయాలను అక్కాచెల్లెళ్లతో పంచుకుంటారనడంలో సందేహం లేదు. నేడు సిస్టర్స్ డే సందర్భంగా అలాంటి కొందరు అక్క చెల్లెళ్లను ఓసారి చూద్దాం.

ఇద్దరూ ఇద్దరే...

ఇచ్ఛాపురం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురానికి చెందిన అక్కాచెల్లెళ్లు భవ్య, భార్గవి కవలలు. ఇద్దరూ ఒకేలా ఉంటారు. ఇద్దరూ సోషల్ మీడియాలో చాలా చురుగ్గా ఉంటారు. నిత్యం రీల్స్ చేస్తుంటారు. డ్యాన్స్‌లోనూ.. అనుకరణలోనూ ఇద్దరూ ఇద్దరే. పట్టణంలోని పరపటి కోటి, మంజుల దంపతుల పిల్లలు భవ్య, భార్గవి ప్రస్తుతం ఇచ్ఛాపురంలో ఇంటర్ చదువుతున్నారు. ఈ కవలల అభిప్రాయాలు, అభిరుచులు ఒకేలా ఉంటాయి. చదువుతో పాటు డ్యాన్స్, ఇతరత్రా అంశాల్లో చాలా చురుగ్గా ఉంటారు. వీరిని చూసి పట్టణవాసులు ఎంతో ముచ్చట పడుతుంటారు. వీరి చేసే రీల్స్ ఎంతో ఫేమస్ అయ్యాయి. 'ఇచ్ఛాపురం సిస్టర్స్' పేరు పొందిన వీరికి ఇన్‌స్టా గ్రామ్‌లో ఎంతోమంది అభిమానులు ఉన్నారు. జీవితాంతం ఒకరికి ఒకరు తోడుగా, నీడగా ఉంటామని.. తల్లిదండ్రులను చక్కగా చూసుకుంటామని చెబుతున్నారు ఈ సోదరీమణులు.


భవ్య, భార్గవి

స్టేషన్లకు వచ్చే మహిళలతో మర్యాదగా వ్యవహరించాలి

- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్లకు వచ్చే మహిళా బాధితులు, మహిళల పట్ల మర్యా దపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ఆదేశించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఏఎస్పీ వెంకటరమణతో కలిసి జిల్లాలో ఉన్న డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో క్రైం అగినెస్ట్ ఉమెన్ కేసుల నమోదు, దర్యాప్తు, మహిళా ఫిర్యాదులు, నాన్‌బె యిల్‌బుల్ వారెంట్స్, పెండింగ్‌కు ఉన్న కారణాలపై జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సమస్యలతో పోలీస్ స్టేషన్లకు వచ్చే మహిళల సమస్యలు, వారి అర్జీలను ఎస్‌హెచ్‌వోలు పూర్తిస్థాయిలో తెలుసుకొని చట్ట పరమైన, ఖచ్చితమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతిరోజూ మహిళా పోలీసులతో గ్రామాల్లో సంద ర్శించి మహిళలపై జరుగుతున్న దాడులు, గృహహింస, ఇతర నేరాల గురించి తెలుసుకోవాలన్నారు. మహిళా చట్టాలు, మహిళా భద్రత తదితర అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం సేకరించేలా చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యమైన కేసుల్లో జారీ చేయబడిన ఎన్‌బీడబ్ల్యు అమలుకు ప్రత్యేక పోలీస్ బృందాలు ఏర్పాటుచేసి ప్రతి కేసులో కోర్టువారు జారీ చేసిన వారెంట్స్ అమలుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జూమ్ కాన్ఫరెన్స్‌లో సైబర్ సెల్ సీఐ శ్రీనివాస్, డీఎస్ఆర్‌బీ ఎస్ఐ గోవిందరావు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో కార్యాలయ సూపరింటెండెంట్ సస్పెన్షన్

- ఏఎన్ఎంల బదిలీల్లో అవకతవకలపై చర్యలు

అరసవల్లి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన గ్రామ/వార్డు సచివాలయ ఏఎన్ఎంల బదిలీలలో చోటు చేసుకున్న అవినీతి ఆరోపణల నేప థ్యంలో డీఎంహెచ్‌వో కార్యాలయ సూపరింటెండెంట్ డి.భాస్కర్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఏఎన్ఎంల బదిలీలు, ప్రమోషన్లలో జరిగిన అవకతవకలపై ఇచ్చిన షోకాజ్ నోటీసులకు ఆయన ఇచ్చిన వివరణలతో ఏకీభవించని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తీసుకున్న క్రమశిక్షణా చర్యల్లో భాగంగా సస్పెన్షన్‌కు సిఫారసు చేశారు. దీంతో రీజినల్ డైరెక్టర్, మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్, విశాఖపట్నం, డాక్టర్ పి.రాధారాణి శనివారం సాయంత్రం సస్పెన్షన్ ఉత్తర్వులను జారీ చేశారు. ముందస్తు అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్ విడిచి వెళ్లడానికి వీల్లేదని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీనిపై తదుపరి విచారణ జరుగుతుందని, సస్పెన్షన్ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తున్నట్లు పేర్కొన్నారు.

'అన్నదాత సుఖీభవ' జమతో రైతుల హర్షం


సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న రైతులు

ఇచ్ఛాపురం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ నగదు బ్యాంక్ ఖాతా ల్లో జమ కావ డంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు శనివారం లొద్దపుట్టి గ్రామంలో సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలభిషేకం చేశారు. స్వీట్లు పంచుకొని సంబరాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి హరీష్, టీడీపీ ప్రెసిడెంట్ పరశురాం, వైస్ ప్రెసిడెంట్ దుర్యోధన, తులసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ టోర్నమెంట్


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా న్యాయాధికారి

శ్రీకాకుళం లీగల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో వీఎస్ పంతులు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా ప్రారంభించారు. న్యాయవాదులు, న్యాయ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనడం ద్వారా పని నుంచి ఒత్తిడికి ఉపశమనం లభిస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సివిల్ న్యాయాధికారి శ్రీధర్, జిల్లా బార్ అసోసియేషన్ ప్రతి నిధులు శివప్రసాద్, దామోదర్, త్రిపురాన వరప్రసాద్ పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు ఘన నివాళి


పింగళి వెంకయ్య విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్ ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరిలో జాతీయతను ప్రతిబింబించేది జాతీయ పతాకమని, దానిని రూపొందించి పింగళి వెంకయ్య చిరస్థాయి కీర్తిని పొందారని వక్తలు అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య 147వ జయంతిని స్థానిక గాంధీ స్మృతివనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. 105 అడుగుల జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో తెలుగు మహిళా నియోజకవర్గ ఇన్‌చార్జి గొండు స్వాతి, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షురాలు డాక్టర్ పైడి సింధూర, గాంధీ మందిర నిర్వాహకులు వావిలపల్లి జగన్నాథం నాయుడు, జామి భీమశంకర్, నటుకుల మోహన్, కొంక్యాన వేణుగోపాల్, హారికాప్రసాద్, డాక్టర్ మందుల మోహనరావు, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

బోధనేతర పనుల నుంచి తప్పించాలి


ధర్నా చేస్తున్న ఫ్యాప్టో నాయకులు

పాత శ్రీకాకుళం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి తప్పించాలని, 12వ పీఆర్సీ ప్రకటన చేయాలని, మధ్యంతర భృతి ప్రకటించాలని, పెండింగ్ డీఏలను విడుదల చేయాలని ఫ్యాప్టో డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ జనరల్ కొప్పల భానుమూర్తి మాట్లాడుతూ.. 11వ పీఆర్సీ గడువు ముగిసినా 12వ పీఆర్సీ వేయకపోవడం దుర్మార్గమన్నారు. జిల్లా ఫ్యాప్టో చైర్మన్ బమ్మిడి శ్రీరామమూర్తి మాట్లాడు తూ.. యాప్‌ల పేరుతో ఉపాధ్యాయులపై పనిభారం పెంచి బోధనకు విఘాతం కలిగించడం తగదన్నారు. ఉమ్మడి సీనియారిటీ ప్రాతిపదికన ఎంఈవో పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఫ్యాప్టో నాయకులు పడాల ప్రతాప్ కుమార్, మజ్జి మదన్మోహన్, టెంక చలపతి రావు, ఎస్వీ రమణ పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నిరుపేద విద్యార్థినులకు క్రెడిట్ యాక్సిస్ ఇండియా ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో రూ.వేలు స్కాలర్‌షిప్, ప్రశంసాపత్రాలను అందించారు. శనివారం డీఆర్వో కార్యాలయంలో డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, ఉప కలెక్టర్ పద్మావతి వీటిని అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు బి.వెంకటరమణ, ఎస్.నీలంనాయుడు, దుర్గారెడ్డి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్, కళాశాలల్లో జూనియర్ రెడ్‌క్రాస్ ఏర్పాటు

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని హైస్కూళ్లు, కళాశాలల్లో జూనియర్ రెడ్‌క్రాస్ విభా గాలను ఏర్పాటు చేయాలని డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జూనియర్, యూత్ రెడ్‌క్రాస్ సమీక్ష సమావేశం శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. సమావేశంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, డీఎంహెచ్‌వో డా.కె.అనిత తదితరులు పాల్గొన్నారు.

హమాలీలకు న్యాయం చేయాలి

ఎచ్చెర్ల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా ఎచ్చెర్లలోని బాట్లింగ్ యూనిట్‌లో పనిచేస్తూ ఉపాధి పొందుతున్న హమాలీలకు న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు అన్నారు. ఎచ్చెర్లలోని బాట్లింగ్ యూనిట్‌ను విభజించి టెక్కలిలో కొత్త డిపో ఏర్పాటును నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో హమాలీలు శనివారం పొర్లు దండాలతో నిరసన తెలిపారు. హమాలీల యూనియన్ నాయకులు టి.రామా రావు, ఎం.సురేష్, నిడిగింట్ల రమణ, బోనెల రాము పాల్గొన్నారు.

స్వయంశక్తి సంఘాలకు రుణాలందించాలి

ఇచ్ఛాపురం. ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మహిళా స్వయంశక్తి సంఘాలకు సూక్ష్మ రుణ ప్రణాళికలు పెండింగ్ లేకుండా రుణాలు అందించాలని ఎల్‌డీఎం పి.శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో జాయింట్ మండల లెవల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం సూర్యఘర్‌కు అర్హత ఉన్న లబ్ధిదారులకు రుణా లివ్వాలన్నారు. దరఖాస్తులను తిరస్కరించవద్దన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ కన్వీనర్ లీలాన్ష్ మిశ్రా, ఏపీఎం ఎస్.ప్రసాద్, వ్యవసాయాధికారి పి.శ్రీదేవి పాల్గొన్నారు.

అలరించిన ఏకపాత్రాభినయం పోటీలు

శ్రీకాకుళం కల్చరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో బాపూజీ కళామందిర్‌లో శనివారం ఉత్తరాంధ్ర స్థాయి పౌరాణిక, సాంఘిక, జానపద నాటక ఏకపాత్రా భినయం పోటీలు నిర్వహించారు. కళాకారులకు సత్కరించారు. సంస్థ ప్రతినిధులు ఎల్.రామలింగస్వామి, రామచంద్రదేవ్, పన్నాల నరసింహమూర్తి, వాసుదేవాచారి, పొట్నూరు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నటి నిధి అగర్వాల్ సందడి

- సౌత్‌ఇండియా షాపింగ్‌మాల్ పునః ప్రారంభం
- స్టెప్‌లు వేస్తూ అభిమానులకు పలకరింపు

శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని జీటీ రోడ్డులో ఉన్న సౌత్ ఇండియా షాపింగ్‌మాల్‌ను వర్ధమాన నటి నిధి అగర్వాల్ శనివారం పునః ప్రారంభించి సందడి చేశారు. ముందుగా సౌత్ ఇండియా షాపింగ్ మాల్ డైరెక్టర్లు సురేష్ శీర్ల, అభినయ్, రాకేష్, కేశవ్ ఆమెకు ఘనస్వాగతం పలికారు. ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి మాల్‌ను ప్రారంభించారు. అన్ని ఫ్లోర్లను కలియ తిరుగుతూ వస్త్రాలను పరిశీలించారు. అనంతరం వచ్చిన అభిమానులకు అభివాదం చేస్తూ యువతను ఉర్రూతలూగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. షాపింగ్‌మాల్ పునః ప్రారంభానికి శ్రీకాకుళం జిల్లాలో అడుగు పెట్టడం ఆనందంగా ఉంద న్నారు. కొన్నేళ్లుగా సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ యాజమాన్యం దేశంలోనే కాకుండా తెలుగు రాష్ట్రాల్లో ప్రజలకు నాణ్యమైన వస్త్రాలను అన్ని వర్గాల వారికి అందుబాటు ధరలో అందిస్తోందన్నారు. ఇటువంటి నమ్మక మైన ఫ్యామిలీ వస్త్ర దుకాణాన్ని ప్రారంభించేందుకు తనను ఆహ్వానించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కుటుంబమంతా సందర్శించాల్సిన ఫ్యామిలీ వస్త్ర దుకాణం సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ అని, మగువలకు కావాల్సిన చీరలు, పెళ్లి పట్టు చీరలకు నిలయంగా నిలిచిందన్నారు. రానున్న వరలక్ష్మీదేవి వ్రతానికి మహిళలకు కావాల్సిన అన్ని రకాల చీరలు అందుబాటులో ఉంచారని, తప్పక సందర్శించాలని కోరారు. ఇటీవల తాను నటించిన హరిహరవీరమల్లు చిత్రం బాక్సాఫీస్ వద్ద పెద్ద హిట్ అయిందని, పవన్ కల్యాణ్ వంటి పెద్ద హీరోకు జంటగా నటించడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. రాజాసాబ్ చిత్రంలో హరిఓం ప్రభాస్ సరసన నటించడం జరుగుతుందని, మంచి కథ ఉన్న చిత్రాల కోసం ఎదురుచూస్తున్నానన్నారు. ఎన్నో అవకాశాలు వస్తున్నా తన మనసుకు మంచి కథ అనిపిస్తేనే సినిమాలు ఒప్పుకుంటానన్నారు. అనంతరం షాపింగ్ మాల్ బయట ఏర్పాటు చేసిన స్టేజ్ పైకి వచ్చి సిక్కోలు యువత కోసం డ్యాన్స్ చేస్తూ సందడి చేశారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నటి నిధి అగర్వాల్, చిత్రంలో మాల్ డైరెక్టర్లు


నటి నిధి అగర్వాల్‌ను చూసేందుకు తరలి వచ్చిన యువత

డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదాం

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని 'సే నో టు డ్రగ్స్' అని ప్రముఖ సినీ నటి నిధి అగర్వాల్ పిలుపునిచ్చారు. జిల్లాలో మత్తుపదార్థాలు వల్ల నివారణ, నియంత్రణ చర్యల్లో భాగంగా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు టౌన్ డీఎస్పీ వివేకానంద ఆధ్వర్యంలో ఆమె పోస్టర్లను ప్రదర్శించారు. డ్రగ్స్ వద్దు బ్రో, సంకల్పం, శక్తియాప్, నారీశక్తి పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు.

ఇండియన్ బాక్సింగ్ కోచింగ్‌కు సిక్కోలు విద్యార్థి



శ్రీకాకుళం స్పోర్ట్స్ ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించనున్న ఇండియన్ క్యాంప్‌నకు జిల్లాకు చెందిన గంధం సత్య భార్గవ్ ఎంపికయ్యాడు. ఇటీవల జూనియర్ నేషనల్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం కైవసం చేసుకున్న భార్గవ్‌కు ఈనెల 2 నుంచి 15వ తేదీ వరకు హర్యానా రోహతక్‌లో జరగనున్న కోచింగ్ క్యాంపునకు వెళ్లనున్నాడు. స్థానిక చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఇంటర్ చదువుతున్న సత్య భార్గవ్ ఆరేళ్లుగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ శిక్షకుడు ఉమామహేశ్వరరావు వద్ద శిక్షణ పొందుతున్నాడు. ఈ శిక్షణలోనూ రాణించాలని స్నేహితులు కోరుతున్నారు.

ఐదు నుంచి ఆన్‌లైన్ పర్యవేక్షణ చేయలేం

ఆమదాలవలస, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు ఇచ్చిన ఫోన్లను ఈనెల నాలుగో తేదీన సీడీపీవో కార్యాలయంలో అందజేస్తామని అంగన్‌వాడీ కార్యకర్తలు తెలిపారు. ఈ మేరకు శనివారం డేటా ఎంట్రీ ఆపరేటర్ అమర్‌కు నోటీసు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆగస్టు 5వ తేదీ నుంచి ఆన్‌లైన్ పర్యవేక్షణ చేయలేమని అన్నారు. రికార్డుల్లో వివరాలు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీల జిల్లా యూని యన్ నాయకురాలు పంచాది లతాదేవి, సెక్టార్ అధ్యక్షురాలు పి.భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఒక స్టేషన్ ఒక ఉత్పత్తి

ఆమదాలవలస, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్‌లో రైల్వేశాఖ ఆధ్వర్యంలో వన్‌స్టేషన్ వన్ ప్రొడక్ట్‌లో భాగంగా స్వయం సహాయక సంఘ ఉత్పత్తుల విక్రయ స్టాల్‌ను సెర్ప్, గ్రామీణ అభివృద్ధి సంస్థ పీడీ కిరణ్ కుమార్, స్టేషన్ మాస్టర్ ఎస్.ఉమామహేశ్వరరావు శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో డీపీఎం బి.నారాయణరావు, ఏపీఎం జి.నారాయణరావు, ఎంఎంఎస్ అధ్యక్షురాలు టి.ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతుతోనే దేశ ప్రగతి సాధ్యం

శ్రీకాకుళం రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రైతు లేనిదే ప్రపంచ మనుగడ లేదని, దేశ ప్రగతి రైతుతోనే సాధ్యమని టీడీపీ మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతి శంకర్ అన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం కళ్లేపల్లిలో అన్నదాత సుఖీభవ కార్యక్రమం నిర్వహించారు. సూపర్ 6 హామీల్లో భాగంగా రైతు సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించార న్నారు. కార్యక్రమంలో రూరల్ మండలం టీడీపీ నాయకులు, గ్రామాధికారులు పాల్గొన్నారు.

బాబా శత జయంతి ఉత్సవాల్లో పాల్గొనండి

- కేంద్ర మంత్రులకు ఆహ్వానం

శ్రీకాకుళం కల్చరల్ ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నవంబరులో పుట్టపర్తిలో జరగనున్న భగవాన్ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో పాల్గొనాలని సత్యసాయి సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు కోరారు. ఈ మేరకు శనివారం ఢిల్లీలో కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మలను కలిసి ఆహ్వానపత్రికలు అందజేశారు. సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో వేలాది మంది భక్తులు పాల్గొంటున్నందున వివిధ జిల్లాల నుంచి పుట్టపర్తికి ప్రత్యేక రైళ్లను నడపాలని ఆయన కోరారు. నవంబరు 21న తిరుపతి నుంచి 2 వేల మంది, విశాఖపట్నం నుంచి 3 వేల మంది, ఒడిశా రాష్ట్రం రాయఘడ నుంచి 2 వేల మంది, శ్రీకాకుళం నుంచి 5 వేల మంది సత్యసాయి భక్తులు, అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి 4 వేల మంది గిరిజన భక్తులు పుట్టపర్తి రానున్నారని కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి అవసరమైన ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేయాలని కోరామని, కేంద్ర మంత్రులు సానుకూలంగా స్పందించారని లక్ష్మణరావు తెలిపారు.


కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుకు ఆహ్వానపత్రిక అందిస్తున్న లక్ష్మణరావు

మహిళలను కించపరిచిన వారిని పరామర్శిస్తారా?

- మాజీ సీఎం జగన్‌పై ఎమ్మెల్సీ గ్రీష్మ ఆగ్రహం

అరసవల్లి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): స్త్రీలపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన వ్యక్తులను మాజీ సీఎం జగన్ పరామర్శిస్తారా అని ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ ప్రశ్నించారు. స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. స్త్రీలను కించపరిచిన నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి ఏమైనా దేశం కోసం పోరాటం చేశాడా నీవు పరామర్శించడానికి... స్త్రీలను అగౌరవపరిచిన వ్యక్తికి పరామర్శకు వెళ్లావని, నీకు ఏమైనా సిగ్గుందా అని నిలదీశారు. తల్లిని, చెల్లిని బయటకు గెంటేసిన వ్యక్తి ఇంతకంటే మంచిగా ఎలా ప్రవర్తించ గలడు. సాక్షి చానెల్‌లో బంగారుపాళెం క్లిప్పింగ్‌లు ఎందుకు వచ్చాయి. టెక్నాలజీని వినియోగించి ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. మహిళల పట్ల మర్యాదగా ప్రవర్తించడం నేర్చుకో, కూటమి నాయకులు, మహిళలు, కార్యకర్తల జోలికొస్తే సహించేది లేదని హెచ్చరించారు.

కొనక గ్రామంలో డీఎంహెచ్‌వో పర్యటన

కంచిలి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కొనక గ్రామంలో 8వ తరగతి విద్యార్థిని గాయత్రి దొండియా మలేరియా వ్యాధి లక్షణాలతో ఇటీవల మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ మేరకు డీఎంహెచ్‌వో కె.అనిత శనివారం ఆ గ్రామంలో పర్యటించి బాలిక తల్లిదండ్రులతో మాట్లాడి మృతికి దారితీసిన పరిస్థితులను అడిగి తెలుసుకు న్నారు. గ్రామంలో పారిశుధ్యం, వైద్యసేవలపై స్థానిక అధికారులతో చర్చించారు. అనంతరం ఎంఎస్ పల్లి, కంచిలి పీహెచ్‌సీలను సందర్శించి వైద్య సేవలపై ఆరా తీశారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆమెతోపాటు ఇన్‌చార్జి వైద్యాధికారి వందిత, కంచిలి వైద్యాధికారి తమ్మినేని హరిప్రసాద్, మలేరియా అధికారి లక్ష్మీనారాయణ ఉన్నారు.


గాయత్రి దండియా కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డా.అనిత

స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం ఏర్పాటు చేయాలి


సమస్యలను మంత్రి శ్రీనివాస్‌కు వివరిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల నియోజక వర్గం పరిధిలో నిరుద్యోగ యువత కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయా లని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు కోరారు. ఈ మేరకు శనివారం జిల్లాకు వచ్చిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు రణస్థలంలో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి ఎన్ఈఆర్ ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందించారు. అలాగే స్థానిక రసాయనిక పరిశ్రమల్లో యువతకు ఉపాధి కల్పించడంలో చొరవ చూపాలని కోరారు.

ఉద్యోగుల సమస్యలపై 5న 'టీ తాగుతూ మాట్లాడుకుందాం'

శ్రీకాకుళం రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలపై ఈనెల 5 'టీ తాగుతూ మాట్లాడుకుందాం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శిమ్మ సోమేశ్వరరావు, జిల్లా కార్యదర్శి సంతోష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఎంపీడీవో కార్యాలయంలో సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్. సూర్యనారాయణ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని మూడు నెలల పాటు వారానికి ఒకసారి నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పూర్వ అధ్యక్షుడు ఐ.నారాయణరావు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.నాగేశ్వరరావు, టౌన్ కార్యదర్శి సూర్యచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పొందూరు ఖాదీ కళాఖండమే: కలెక్టర్

పొందూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రపంచఖ్యాతి పొందిన పొందూరు ఖాదీ అద్భుత కళాఖండమేనని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. మండల కేంద్రంలోని ఏఎఫ్‌కేకే సంఘాన్ని శనివారం సతీమణితో కలిసి పరిశీలించారు. ఖాదీనేత, వడుకు ప్రక్రియలను అడిగి తెలుసుకున్నారు. ఖాదీవస్త్రాలకు మరింత ప్రోత్సాహం అవసరమన్నారు. ఖాదీవస్త్రాల నాణ్యత, ఖాదీకార్మికుల నైపుణ్యాన్ని కలెక్టర్ దంపతులు ప్రశంసించారు. నేత, వడుకు ప్రక్రియలను సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు గుంటుకు కామేశ్వర ప్రసాద్, దండా వెంకట రమణలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు సాయిబాబా వీవర్స్ సొసైటీని సందర్శించి సొసైటీ మేనేజర్ ఒట్టం శ్రీనివాసరావును ఖాదీకి, చేనేతకు తేడాను అడిగి తెలుసుకున్నారు.


ఖాదీ చీరలను పరిశీలిస్తున్న కలెక్టర్ దంపతులు

ఆంధ్రజ్యోతి
మా అక్షరం - మీ ఆయుధం
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా, పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబర్లకు సంప్రదించగలరు.
ACM : 9985411514, శ్రీకాకుళం : 9985411535
రాజాం : 9494691912, పలాస : 9985411532

కొత్త జంట కోరుకునే పెళ్లి కానుక
వివాహ మహోత్సవ శుభాకాంక్షలు
ఆంధ్రజ్యోతి లో
వివాహ ప్రకటన ఇవ్వటం ద్వారా మీ ప్రతిష్ఠను పెంచుకోండి.
నవీన రీతిలో ఆహ్వానించి బంధుమిత్రులను అలరించండి
▸ శుభాకాంక్షలు
▸ ధన్యవాదాలు
▸ వివాహ ఆహ్వానాలు
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం
ప్రకటనలకు సంప్రదించండి
99854 11066

న్యూస్ బాక్స్

ఇంటర్‌లో ప్రవేశాలకు గడువు పెంపు

జి.సిగడాం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2025-2026 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఈనెల 11వ తేదీ వరకు గడువును పెంచినట్లు ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఏపీ ఇంటర్ విద్యామండలి అధికారులు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. మా కళాశాలలో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎంఈసీ కోర్సులున్నాయన్నారు. ఆసక్తి ఉన్న మండల పరిధిలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఓపెన్ స్కూలో చేర్పించాలి

సోంపేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): చదువు మానేసి బయట ఉన్న విద్యార్థులను ఓపెన్ స్కూల్‌లో చేర్పించాలని ఎంఈవో ఎస్.జోరాడు కోరారు. ఈ మేరకు ఎంఈవో కార్యాలయంలో హెచ్‌ఎంలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో ఓపెన్ స్కూల్ లో 10వ తరగతి, 12వ తరగతిలో ప్రవేశాలు చేయించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో జె.కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అశోక్‌ను కలిసిన టీడీపీ కార్యవర్గం

సోంపేట రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను సోంపేట మండలం చేపల గొల్లగండిలో పంచాయతీ టీడీపీ గ్రామ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. కమిటీ సభ్యులను శనివారం ఎన్నుకున్నారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో అధ్యక్షుడు సాగూరు గురుమూర్తి, తెప్పల హరి, ఉపాధ్యక్షుడు నిట్ట గోపాల్, ప్రధాన కార్యదర్శి పురు షోత్తం బాస్కర రావు, కార్యదర్శులుడడ దినేష్, ఎం.జోగారావు తదిత రులు న్నారు.

పీఏసీఎస్ సీఈవో మృతి


జానకిరామ్(ఫైల్)

కవిటి ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కవిటి పీఏసీఎస్ సీఈవో వంజ రాన జానకి రామ్ (55) శనివారం మృతి చెందారు. గత కొంత రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారని కార్యాలయ సిబ్బంది తెలిపారు.

జిల్లా పీఈటీ, పీడీ సంఘ ఎన్నిక

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జిల్లా పీఈటీ, పీడీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా శనివారం ఎన్ను కున్నారు. నూతన అధ్యక్షుడిగా పి.తవిటయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎంవీరమణ ఎన్నికయ్యారు. కోశాధికారిగా కె.మాధవరావు, సహాధ్యక్షులుగా ఎస్.శ్రీనివాసరావు, బి.సురేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఆర్.రవి, హెడ్ క్వార్టర్ కార్యదర్శిగా ఆర్.సతీష్ రాయుడులతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంతో జిల్లా ఒలింపిక్ సంఘం సలహాదారు పి.సుందరరావు ప్రమాణం చేయించారు.

'అన్నదాత సుఖీభవ'తో దగా

శ్రీకాకుళం అర్బన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పేరుతో రాష్ట్రంలోని రైతులను సీఎం చంద్రబాబు మోసం చేస్తున్నారని మాజీ మంత్రి, వైసీపీ నేత సీదిరి అప్పలరాజు అన్నారు. పెద్దపాడు పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. 2024-25 అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం డబ్బులను ఎప్పుడిస్తారో ప్రకటన చేయాలన్నారు.

ANDHRA JYOTHI AJ CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి

HOUSE FOR SALE
» కేవలం 38లక్షల మాత్రమే విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 2 & 3 BHK ఇండివిడ్యువల్ హౌస్, 167 గజాల స్థలంలో, వుడా అప్రూవల్ కలిగినట్టు లేఅవుట్ లో కలదు సంప్ర : 9848777589
AJV_241510

WANTED
» Wanted Testing Engineers (EEE/ECE)-05, Jr. Mrkg executive-03. Fresher/Exp., Imm. Req. Email: careers.sdes@gmail.com. Ph.90529 66639, 73826 66639
AJB-287

WANTED
» శ్రీకాకుళం జిల్లా చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ NGO APSACS సహకారంతో HIV/AIDS పై గ్రామ స్థాయిలో పనిచేస్తుంది. ఈ సంస్థ యందు క్లస్టర్ లింక్ వర్కర్స్‌గా పని చేయుటకు దరఖాస్తులు కోరడం జరుగుతుంది. నరసన్నపేట మరియు కోటబొమ్మాళి మండలంలో రాణా, టెక్కలిపాడు, రావిపాడు, చిన్నబమ్మిడి, గొల్లపేట గ్రామాలలో మరియు వజ్రపుకొత్తూరు మండలంలో బాతుపురం, దేవనల్తాడా, డోకులపాడు, మంచినీళ్లపేట, నువ్వలరేవు గ్రామాలలో పని చేయుటకు ఇంటర్మీడియట్ లేదా ANM Qualification కలిగిన వారు అప్లై చేయగలరు. జీతం: 6050, ట్రావెల్: 2400, సంప్రదించాల్సిన అడ్రస్: చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్, పద్మావతి నిలయం, విశాఖ బి కాలనీ, శ్రీకాకుళం ✆ 9652149853

ఆంధ్రజ్యోతి
అచిరకాలంలో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా! అయితే దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లలో ఏ నెంబరు కైనా ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం వచ్చి మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతే కాదు, పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్ప వచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు.
ఫోన్ నెంబర్లు
ACM : 99854 11514
ACO-1 : 99854 00079
ACO-2 : 99854 11535
Office : 08942 - 281995

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

క్లాసిఫైడ్స్ సంప్రదించాల్సిన నెంబర్లు:
శ్రీకాకుళం: 9985465497, నరసన్నపేట: 9985425891
టెక్కలి: 9949607029, పలాస: 9985411524
సోంపేట: 9989281099, రాజాం : 9573179776

ABN ఆంధ్రజ్యోతి
ఏబీఎన్ - ఆంధ్రజ్యోతిలో మరిన్ని క్రైం వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి
మీ స్మార్ట్‌ఫోన్‌లో యాప్ స్టోర్ నుంచి క్యూఆర్ కోడ్ స్కానర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే, మీ ఫోన్ కెమెరా ద్వారా ఈ కోడ్‌ను స్కాన్ చేయవచ్చు.

సందడిగా అన్నదాత సుఖీభవ

అన్నదాత సుఖీభవ నిధులు పంపిణీ శనివారం జిల్లా వ్యాప్తంగా సందడిగా సాగింది. ఈ సందర్భంగా నమూనా చెక్కులను రైతులకు అందజేసి పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం ద్వారా జిల్లాలో లక్షలాది మంది రైతులకు లబ్ధిచేకూరనుంది. ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే శిరీష



నమూనా చెక్కును రైతులకు అందిస్తున్న ఎమ్మెల్యే శిరీష

వజ్రపుకొత్తూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రైతులకు అన్నివిధాలా అండగా ఉంటామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరిష అన్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని పాతటెక్కలిలో శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో 2,29,748 మంది రైతులకు రూ.19.81 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. కార్యక్రమంలో పలాస ఆర్డీవో జి.వెంకటేష్, వసంతస్వామి, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, ఏఎంసీ వైస్‌చైర్మన్ చంద్రకళ, మాజీ ఎంపీపీలు సూరాడ మోహనరావు, నాయకులు దువ్వాడ హేంబాబుచౌదరి, వ్యవసాయ శాఖ ఏఈ ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటున్న ప్రభుత్వం



కంబకాయిలో చెక్కును రైతులకు అందిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

నరసన్నపేట/ జలుమూరు/ పోలాకి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం నెలకొందని, అయినా రైతులను ఆదుకోవడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. నరసన్నపేట మండలం కంబకాయి, జలుమూరు మండలం లింగాలవలస, పోలాకి మండలం మబుగాం గ్రామాల్లో అన్నదాత సుఖీభవ పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. నియోజవర్గంలో 37,741 మంది రైతుల ఖాతాల్లో రూ.24.9 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నియోజవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, కూటమి నాయకులు పాగోటి ఉమామహేశ్వరి, రోణంకి కృష్ణంనాయుడు, బైరి భాస్కరావు, తర్ర బలరాం, ఎంవీ నాయుడు, ఏడీఏ వెంకటమధు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాది రైతు సంక్షేమ ప్రభుత్వం: అశోక్



కంచిలి ఏఎంసీ ఆవరణలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

కంచిలి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, మాది రైతు సంక్షేమ ప్రభుత్వమని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. కంచిలి మార్కెట్ కమిటీ ఆవరణలో శనివారం అన్నదాత సుఖీభవ, పీఎంకిసాన్ నిధుల విడుదల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎస్.శశిభూషణ్, జనసేన ఇన్‌చార్జి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజు, ఏడీఏ భవానీ శంకర్, ఉద్యానవనశాఖాధికారి మాధవీలత, ఇచ్ఛాపురం ఏఎంసీ చైర్మన్ బి.మణిచంద్రప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల కళ్లల్లో ఆనందమే లక్ష్యం: గ్రీష్మ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ

ఆమదాలవలస, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రైతన్నల కళ్లల్లో ఆనందం చూడడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ అన్నారు. శనివారం కృషి విజ్ఞాన కేంద్రంలో అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతుల ఆకాంక్షలను నెరవేర్చి వారి సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, నారాయణపురం ప్రాజెక్టు చైర్మన్ సనపల ఢిల్లీశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు నూకరాజు, మున్సిపల్ మాజీ చైర్మన్ తమ్మినేని గీత, టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి మొదలవలస రమేష్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బోసెల అప్పారావు, కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి, వ్యవసాయాధికారి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జెండాలో రైతు పనిముట్లను పెట్టుకున్న పార్టీ టీడీపీ



రైతులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ చిరంజీవిరావు

కోటబొమ్మాళి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రైతుల పనిముట్లను జెండాలో పెట్టుకుని, రైతుల కోసం పుట్టిన పార్టీ టీడీపీ అని ఉత్తరాంధ్ర పట్టుభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమీపంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో ఎన్.కృష్ణమూర్తి, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, ఎండీవో ఫణీంద్రకుమార్, టెక్కలి ఏడీఏ జగన్మోహన్‌రావు, తహసీల్దార్ అప్పలరాజు, ఏవో గోవిందరావు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు దోహదం: జడ్పీ సీఈవో



మాట్లాడుతున్న జడ్పీ సీఈవో శ్రీధరరాజా

పాతపట్నం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సాగునకు అన్నదాత సుఖీభవ ఆర్థికంగా ఎంతగానో దోహదపడుతుందని జడ్పీ సీఈవో శ్రీధరరాజా అన్నారు. తామర గ్రామంలో రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సతీమణి తామర గ్రామ సర్పంచ్ మామిడి సుధీష్ణ నమూనా చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ రాజగోపాలరావు, మండలప్రత్యేకాధికారి మంచు కరుణాకరరావు, ఏవో పి.కిరణవాణి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రైతులకు ఆర్థిక భద్రత

కొత్తూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి) రైతులకు అన్నదాత సుఖీభవతో ఆర్థిక భద్రత దొరుకుతుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకట రమణ అన్నారు. శనివారం మాతలలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో మరో హామీని కూటమ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఏడాదికి రూ.20వేలు రైతుల ఖాతాల్లోకి నేరుగా జమకానుందని, దీంతో రైతులకు ఆర్థికంగా సహాయపడుతుందని ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్నదాత సుఖీభవ పథకం రైతు జీవితంలో ఒక సంతోష విత్తనంలా మారాలని ఆయన కోరారు. ఇవే కాకుండా చేనేత కార్మికులకు ఉచితంగా విద్యుత్ మీటర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పిస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రాష్ట్రంలో ప్రజలు అన్నివిధాలా సంతోషంగా జీవనం గడిపేందుకు కూటమి ప్రభుత్వ కృషి చేస్తుందన్నారు.

ఐటీబీపీ హావల్దార్ ఆత్మహత్య



ఈశ్వరరావు(ఫైల్)

పలాస, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పద్మనాభపురం శివాజీనగర్ కాలనీలో నివాసం ఉంటున్న ఐటీబీపీ హావల్దార్ బద్రి ఈశ్వరరావు(36) శనివారం ఆత్మహత్య చేసుకున్నారు. ఈశ్వరరావు జమ్మూకశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్నారు. అనారోగ్య కారణాలతో ఈ ఏడాది జూన్ 11న సెలవుపై స్వగ్రామం శివాజీనగర్ కాలనీకి వచ్చారు. తన బావమరిది ఇంటిలో భార్యాపిల్లలతో కలిసి ఉంటున్నారు. శనివారం ఆయన భార్య బాలసరస్వతి, ఆమె సోదరుడు, వదిన కూలి పనులకు వెళ్లారు. ఇంట్లో ఎవరూలేని సమయంలో ఈశ్వరరావు సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కడుపు నొప్పి తాళలేక ఈశ్వరరావు ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈశ్వరరావుకు భార్య బాలసరస్వతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మృతితో శివాజీనగర్‌లో విషాదఛాయలు అలముకున్నాయి.

కుటుంబ కలహాలతో ఆటో డ్రైవర్..

కొత్తూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): నేరడి-గురండి రహదారి సమీపంలో శనివారం సాయంత్రం టేకు చెట్టుకు ఉరివేసుకుని పెద్దకోట గోవిందరావు(49) అనే ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ ఎండీ అమీర్ ఆలీ తెలిపారు. మెట్టూరు బిట్-2 పంచాయతీ నిర్వాసిత కాలనీకి చెందిన గోవిందరావు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన భార్య గూనభద్ర ఆర్ఆర్ కాలనీ అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ కలహాల కారణంగా గోవిందరావు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తుందని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

సిమెంట్ పరిశ్రమలో ప్రమాదం

● నంద్యాల జిల్లాలో లొద్దపుట్టి వాసి మృతి

ఇచ్ఛాపురం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలంలోని కల్వటాల పరిధిలో ఉన్న రామ్‌కో సిమెంట్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టి ఆర్‌హెచ్ కాలనీకి చెందిన దోలపత్ర దాల్బిని(48) మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. దాల్బిని గత కొంత కాలంగా సిమెంట్ ఫ్యాక్టరీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శనివారం విధులు నిర్వహిస్తుండగా పైనుంచి కిందపడడంతో తలకి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే తోటి కార్మికులు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడని తోటి కార్మికులు ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ప్రమాదవశాత్తు కింద పడిపోయాడా లేదా ఏదైనా ప్రమాదం జరిగిందా అనే అనుమానాలను కుటుంబ సభ్యులు వ్యక్తం చేస్తున్నారు. మృతుడికి భార్య జనకమ్మ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు వలస కూలీగా పనిచేస్తున్నాడు. కుటుంబ పెద్ద చనిపోవడంతో వారంతా కన్నీరు మున్నీరవుతున్నారు.

సారాతో వ్యక్తి అరెస్టు

పలాస రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కాంట్రగడ గ్రామానికి సమీపంలో శనివారం ఒడిశా రాష్ట్రానికి చెందిన జారు శంకర్ సారా అమ్ముతూ పట్టుబడినట్టు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.మల్లికార్జునరావు తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడి చేసి 10 లీటర్ల సారాతో శంకర్ పట్టుబడ్డాడన్నారు. టాస్క్‌ఫోర్స్ అధికారి బి.మధుకుమార్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఐదు గేదెలు పట్టివేత

హరిపురం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మందస మండలం మఖరజోల గ్రామం వద్ద జాతీయ రహదారిపై పశువుల వ్యాన్‌ను ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా శనివారం ఐదు గేదెలతో వెళ్తున్న వాహనాన్ని సీజ్ చేశారు. ఈ గేదెలను గుజ్జులవలస గోశాలకు తరలించినట్టు ఎస్ఐ తెలియజేశారు.

23 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు



గంజాయితో పట్టుబడ్డ నిందితులు

టెక్కలి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఒడిశాకు చెందిన ఇద్దరు మహిళలు, మరో వ్యక్తి టెక్కలి రైల్వేస్టేషన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వచ్చే ప్రాంతంలో 23 కిలోల గంజాయితో శనివారం పోలీసులకు శనివారం పట్టుబడ్డారు. ఒడిశా రాష్ట్రం రాయగడ జిల్లా పద్మాపూర్, తెంబగూడ, మిల్యాపం గ్రామాలకు చెందిన రచనాలిమా, ఆకాష్ హెంటా, పారాకుమారి బర్దన్ ముగ్గుర్ని అరెస్టు చేశారు. అలాగే గుణుపూర్ నుంచి గంజాయి ప్యాకెట్లను విశాఖ, హైదరాబాద్ ప్రాంతాలకు రైళ్లలో, బస్సుల్లో వీరు తరలిస్తుంటారని సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఒడిశాలోని సుందరగూడకు చెందిన బిడగ రమేష్, మహారాష్ట్ర అకోలా జిల్లా హరిహరపేటకు చెందిన గోకుల్ చంద్రాకర్‌ను ఇంకా అరెస్టు చేయాల్సి ఉందని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఎమ్మెల్సీ దువ్వాడకు నోటీసు



నోటీసు తీసుకుంటున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

హిరమండలం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌పై చేసిన వ్యాఖ్యలకు గాను ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు నోటీసు జారీ చేసినట్లు ఎస్ఐ ఎండీ యాసిన్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఓ టీవీ చానల్ నిర్వహించిన ఇంటర్వ్యూలో దువ్వాడ మాట్లాడుతూ పవన్‌పై పలు విమర్శలు చేశారు. ప్రశ్నించడానికే రాజకీయాల్లోకి వచ్చానని చెప్పిన పవన్.. టీడీపీ అధినేత చంద్రబాబు వద్ద నెలకు రూ.50 కోట్లు తీసుకుని ఆయన్ను ప్రశ్నించడం లేదని అప్పట్లో అన్నారు. దీనిపై ఈ ఏడాది మార్చి 8న చొర్లంగి జనసేన నాయకుడు వంజరాపు సింహాచలం హిరమండలం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు దువ్వాడపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. టెక్కలిలోని దువ్వాడ కార్యాలయంలో ఆయనకు ఏఎస్ఐ చంద్రరావు శనివారం నోటీసు అందజేశారు

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

పోలాకి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి కోడూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. గరిమెళ్ల జయంతి కమిటీ ప్రధాన కార్యదర్శి బాడాన రాజు ఆధ్వర్యంలో వెంకయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. పాఠశాల ఇన్‌చార్జి చింతాడ లక్ష్మణరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● టెక్కలి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం పింగలి జయంతి ఘనంగా నిర్వహించారు. పింగలి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించాం. ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, డాక్టర్ సతీష్, లూక్‌పాల్, రామారావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నందిగాం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): నందిగాం బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి నేరుగా ప్రవేశాలు కల్పించను న్నట్టు ప్రిన్సిపాల్ బసవల మంజుల శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గలవారు నేరుగా గురుకులం సంప్రదించాలన్నారు.

వైసీపీ డీఎన్‌ఏలోనే నీచ సంస్కృతి

పలాస, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మహిళలను కించపరిచిన వైసీపీ నాయకులు ప్రసన్నకుమార్‌రెడ్డిని పలుకరించేందుకు వెళ్లిన ఆ పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి నిజస్వరూపం బయట పడిందని, వారి డీఎన్‌ఏలోనే నీచసంస్కృతి ఉందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మండిపడ్డారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. వరుసకు సోదరి అయ్యే ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రసన్న కుమార్‌రెడ్డిని మందలించాల్సింది పోయి ఆయన్ని పరామర్శించడానికి జగన్మోహన్‌రెడ్డి రావడం దారుణమన్నారు. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో రాష్ట్రంలో ఏమి అభివృద్ధి చేశారో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ప్రజావేదిక కూల్చివేత నుంచి ప్రారంభించిన విధ్వంసకాండ చివరకు తమ నేత చంద్రబాబు అరెస్టు చేసిన వరకూ వచ్చారని, అందుకే ప్రజలు కేవలం 11 సీట్లు ఇచ్చి ప్రతిపక్షం లేకుండా చేశారన్నారు

పార్టీ కోసం శ్రమించే వారికే గుర్తింపు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

నరసన్నపేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతానికి శ్రమించే వారికి తగిన గుర్తింపు ఉంటుందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. శనివారం నరసన్నపేటలోని ఒక హోటల్‌లో నియోజవర్గ స్థాయి బీజేపీ విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని కూటమి ప్రభుత్వం అయినా పార్టీని బలోపేతం చేయడపంపై ప్రతీ ఒక్కరూ దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు, జిల్లా ఇన్‌చార్జ్ విజయనంద రెడ్డి, నాయకులు పైడి వేణుగోపాలం, పూడి తిరుపతిరావు, చింతు పాపారావు తదితరులు పాల్గొన్నారు.

పల్లెనిద్రలో పోలీసులు



బిడిమి గ్రామ యువతతో పోలీసు అధికారులు

హరిపురం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మందస మండలం రాంపురం పంచాయతీ బిడిమి గ్రామంలో కాశీబుగ్గ డీఎస్పీ వెంకటప్పారావు, కాశీబుగ్గ రూరల్ సీఐ తిరుపతిరావు, మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ శుక్రవారం రాత్రి పల్లెనిద్ర చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని యువత, మహిళలతో మాట్లాడి, వారి కష్ట, సుఖాలు తెలుసుకున్నారు. ఎయిర్‌పోర్టు బాధిత గ్రామాల్లో ప్రధానమైనది బిడిమి గ్రామం కావడంతో పోలీసు అధికారులు యువతకు, మహిళలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో పోలీసు అధికారులతోపాటు సచివాలయ ఉద్యోగులు, జుత్తు కూర్మారావు, అమ్మినాయుడు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లండి



మాట్లాడుతున్న సమన్వయకర్త వెంకన్న చౌదరి

పలాస, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని పలాస నియోజకవర్గం టీడీపీ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి కోరారు. ఈ మేరకు ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు స్వగృహంలో పలాస క్లస్టర్ టీడీపీ నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెంకన్నచౌదిరి మాట్లాడుతూ.. సూపర్‌సిక్స్ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు యాదవ్, గాలి కృష్ణారావు, మల్లా శ్రీనివాస్, యవ్వారి మోహనరావు, ఎం.నరేంద్ర, దువ్వాడ శ్రీకాంత్, గురిటి సూర్యనారాయణ, కొత్త సత్యం, సవర రాంబాబు, జోగ మల్లి పాల్గొన్నారు.

ధర్మస్థలి నేరస్థులను కఠినంగా శిక్షించాలి

పలాసరూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం ధర్మస్థలి ఆలయంలో బాలికలు, మహిళలను పూడ్చిపెట్టిన నేరస్థులను కఠినంగా శిక్షించాలని పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1995 నుంచి 2014 వరకూ పని చేసిన మాజీ పారిశుధ్య కార్మికుడు అనేక మందిని అత్యాచారం చేసి చంపారనే విషయాన్ని బయటకు తెలియజేశారని, ఆ పనులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ ఘటనలు ధర్మానికో, మతానికో సంబంధించినవి కావని, మహిళలు, బాలికలపై జరిగిన ఘటనలన్నారు.

శివారు భూములకు సాగునీరందించడమే లక్ష్యం



ఎన్‌బీసీ కెనాల్‌ను పరిశీలిస్తున్న వంశధార అధికారులు

జలుమూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి) కాలువల ద్వారా శివారు భూములకు సాగునీరందించడమే ప్రభుత్వ లక్ష్యమని వంశధార టాస్క్‌ఫోర్సు డీఈ భవాని శంకర్ తెలిపారు. పెద్దదూగాం వద్ద వంశధార ప్రధాన ఎడమ కాలువను పరిశీలించి 24 ఎన్‌బీసీ కాలువకు నీటి ప్రవాహాన్ని నిలిపివేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వంశధార ప్రధాన ఎడమ కాలువలో 80 కిలోమీటర్లు వరకు పలాస వరకు సాగునీరు వెళ్లిందన్నారు. శివారు భూములకు సాగునీరందాలంటే 104 కిలోమీటర్లు వరకు సాగునీరు విడచిపెట్టాలన్నారు. ఈఈ మురళీమోహన్, డీఈ శిమ్మ శ్రీనివాసరావు, జేఈలు ఉన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

వజ్రపుకొత్తూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని ఎమెల్యే గౌతు శిరీష అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం శనివారం పాతటెక్కలిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సూరాడ మోహనరావు, మాజీ సర్పంచ్‌లు కొల్లి రమేస్, శివయ్య, నాయకులు పుచ్చ ఈశ్వర్రావు, కర్ని రమణ ఉన్నారు.

బీజేపీ ప్రభుత్వంతోనే రైతుల అభివృద్ధి

కాశీబుగ్గ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రైతులు అభివృద్ధి బీజేపీ ప్రభుత్వంతోనే సాధ్యమని ఆ పార్టీ సీనియర్ నాయకులు రామానంద్ స్వామి, రాజుమోహన్ అన్నారు. శనివారం దేశంలో 9.7 కోట్ల రైతులకు పీఎం కిసాన్‌లో భాగంగా ప్రధాని మోదీ రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమ చేసిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 46 లక్షల మంది రైతులకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. సమావేశంలో మామిడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక రేపు

టెక్కలి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పాతపట్నం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఈ నెల 4న నిర్వహించనున్నట్టు సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి తెలిపారు. టెక్కలి డివిజన్‌కు చెందిన అందరు అధికారులు, పాతపట్నం మండలస్థాయి అధికారులకు పీజీఆర్ఎస్‌కు హాజరై ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. టెక్కలి డివిజన్ పరిధిలో గల తొమ్మిది మండలాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, 8333989272 నెంబరుకు సంప్రదించాలని కోరారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

టెక్కలి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ పరిధిలో పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం ఐసీడీఎస్ అధికారులకు శనివారం వినతి పత్రం అందజేశారు. పోషన్ ట్రాకర్, బాలసంజీవిని వంటి యాప్‌ల నిర్వహణకు మొబైల్ ఫోన్లు పనిచేయడం లేదని, అందువలన తమ దగ్గరున్న మొబైల్ ఫోన్లు కార్యాలయానికి అందజేస్తామని తెలిపారు. అంతేకాకుండా ఫోటో క్యాప్చర్, ఓటీపీలు, ఎఫ్ఆర్ఎస్‌లు పనిచేయడం లేదని వారు వివరించారు.

ఓపెన్ స్కూల్ విద్యను సద్వినియోగం చేసుకోవాలి

పలాసరూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ విద్యను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, మధ్యలో చదువు నిలిపివేసిన విద్యార్థులు ఓపెన్ స్కూల్ విద్యను వినియోగించుకోవాలని ఎంఈవోలు సీహెచ్ శ్రీనివాసరావు, సీహెచ్ సత్యం అన్నారు. పలాస మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శనివారం సార్వత్రిక విద్యాపీఠంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం జాంభవతి, మండల ఎంఐఎస్ కోఆర్డినేటర్ బాలరాజు, అంగన్‌వాడీ ఆయాలు, వెలుగు సభ్యులు, సచివాలయం ఉద్యోగులు,ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవం జయప్రదం చేయండి

కొత్తూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వారోత్సవాన్ని ఈనెల 9న నిర్వహించనున్నట్టు ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని ఆ సంఘ జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న కోరారు. వారం రోజులపాటు జిల్లా అంతటా సభలు సమావేశాలు నిర్వస్తామన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలను కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులుగా ఎదగాలి

కొత్తూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా ఎదగాలని కొత్తూరు సిఐ చింతాడ ప్రసాద్ విద్యార్థులకు సూచించారు. శనివారం లబ్బ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్‌ను అందజేశారు. ఎస్ఐ అమీర్ ఆలీ, హెచ్ఎం తదితరులు పాల్గొన్నారు.

నిధుల విడుదలపై హర్షం

సంతబొమ్మాళి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అన్నదాన సుఖీభవ నిధులు విడుదలపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు మేఘవరం సచివాలయంలో శనివారం ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మరువాడ సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి, మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు గంట లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై వలలు ఇప్పించండి

సంతబొమ్మాళి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు 90శాతం సబ్సిడీపై వలలు, బోట్లు మంజూరు చేయాలని టీడీపీ మత్స్యకార నాయకులు సూరాడ ధనరాజ్, చొక్కరి నర్సింహులు కోరారు. ఈ మేరకు శనివారం కోటబొమ్మాళి వచ్చిన ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావును కలిసి వినతిపత్రం అందజేశారు. 2014-19లో రాష్ట్రంలోని టీడీపీ ప్రభుత్వం 90శాతం సబ్సిడీపై మత్స్యకారులకు వలలు, బోట్లు మంజూరు చేశారన్నారు. అయితే ప్రస్తుతం 50శాతం సబ్సిడీతో మాత్రమే ఇస్తున్నారని గతంలో మాదిరిగా అదించాలని కోరారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

పలాస, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అన్ని వార్డుల్లోనూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. శనివారం స్థానిక పురుషోత్తపురం కాలనీలో రూ.5 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, కాలువకు ఆమె శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, కమిషనర్ ఎన్.రామారావు, ఏపీట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, టీడీపీ నాయకులు లొడగల కామేశ్వరరావు యాదవ్, మల్లా శ్రీనివాస్, సప్ప నవీన్, బడ్డ నాగరాజు, గాలి కృష్ణారావు, పాల్గొన్నారు.

విమర్శలు చేయడం తగదు

పలాస, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): నిస్వార్థంగా ప్రజలకు సేవ చేస్తున్న పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష , ఆమె భర్త, పలాస నియోజకవర్గం సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్నచౌదరిపై వెసీపీ నాయకులు తమ మీడియా ద్వారా విమర్శలు చేయడాన్ని తగదని టీడీపీ నాయకులు మండిపడ్డారు. శనివారం సాయంత్రం స్థానిక టీడీపీ కార్యాలయంలో జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు, పీసీఎంఏ ప్రధాన కార్యదర్శి టంకాల రవిశంకర్‌గుప్తా, సీనియర్ కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ విలేకరులతో మాట్లాడారు. దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మలేకే 2024 ఎన్నికల్లో ఘోరంగా ఓడించారన్న విషయాన్ని గుర్తించాలన్నారు. సమావేశంలో జోగ మల్లి, కె.సురేష్, చాణక్య, శివాజీ ఉన్నారు.

ట్యాబ్స్, సెల్‌ఫోన్స్ అందించండి

పలాసరూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): 5జీ నెట్‌వర్క్ కలిగిన ట్యాబ్స్, సెల్‌ఫోన్స్ అందించాలని, సాంకేతికంగా 4జీ నెట్‌వర్క్ పని చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులుపడుతున్నామని అంగన్‌వాడీ కార్యకర్తలు ఐసీడీఎస్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కాశీబుగ్గ ఐసీడీఎస్ ప్రాజెక్టులో శనివారం కార్యకర్తలంతా సమస్యలతో కూడిన వినతిపత్రంను అందజేసి మాట్లాడారు. 4జీ నెట్‌వర్క్‌తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, సరైన సమయంలో పనులు కాకపోవడంతో అధికారులు అందజేసిన సెల్‌ఫోన్లను ఈ నెల 4న కార్యాలయడం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు డి.సునీత, పి.పద్మావతి, ఆర్.అరుణ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై ఎరువులు

పలాసరూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై ఎరువులు అందిస్తుందని పలాస పీఏసీఎస్ చైర్మన్ వంకల కూర్మారావు అన్నారు. పలాస మండలం లొద్దభద్ర రైతుభరోసా కేంద్రం వద్ద శనివారం రైతులకు ఎరువులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. టీడీపీ నాయకులు పీరికట్ల విఠల్‌రావు, సవర సోమేశ్వరరావు, తమ్మినేని గంగారామ్ పాల్గొన్నారు.